## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. రెవెన్యూ కాలనీ, ప్రగతినగర్, నాగేంద్రనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### టీ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్‌లో చోటు



హన్మకొండ: తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలోకి జిల్లా వాసులు ఎన్నికయ్యారు. హనుమకొండ జిల్లాకు చెందిన వుప్పు రాజేందర్ కోశాధికారిగా, కుడికాల ప్రసాద్ సహాయ కార్యదర్శిగా, వెన్నె రవి, ఎండీ.రఫీక్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు వనమాల సత్యం, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, జిల్లా ఏజెంట్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

### చాణక్య దళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లికార్జున శాస్త్రి



కాజీపేట: అఖిల భారతీయ చాణక్య దళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా అయినవోలు మల్లికార్జున శాస్త్రి నియమితులయ్యారు. ఈమేరకు హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణానికి చెందిన శాస్త్రికి నియామక పత్రాన్ని జాతీయ అధ్యక్షుడు ఎల్.మురళిదేశ్ పాండే అందజేశారు.

### భారత జాగృతి జిల్లా కో కన్వీనర్‌గా హరితారెడ్డి



హన్మకొండ: భారత జాగృతి హనుమకొండ జిల్లా కో కన్వీనర్‌గా హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ -2కు చెందిన మాడుగుల హరితారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయభాస్కర్ సోమవారం తెలిపారు.

### సైకిల్‌వాకర్స్ రక్తదానం



విద్యారణ్యపురి: సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని విద్యా కళాశాలలో గాంధీ విగ్రహానికి, పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీ విగ్రహాలకు ఆ కమిటీ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి, బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి సైకిల్‌పై వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి వరకు వెళ్లి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ సమక్షంలో రక్తదానం చేశారు. అసోసియేషన్ బాధ్యులు అనంత్, వేణుగోపాల్, నరసయ్య, సాంబమూర్తి, రాములు, శ్రీనివాస్, రవీందర్, లక్ష్మయ్య, అలీ, బ్లడ్ డొనేషన్ మోటివేటర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

### గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కాజీపేట: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్యకర్తలతో కలిసి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం గ్యారంటీ కార్డులను ఇంటింటి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ.అంకూస్, అరూరి సాంబయ్య, భరత్, పాలడుగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### అనుమతి లేదనే ఐలమ్మ విగ్రహం తొలగింపు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ఆర్‌ఈసీ పాఠక్ తండా ప్రధాన రహదారిపై రజకులు ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మున్సిపల్ అధికారులు తొలగించినట్లు ప్రచారం జరుగుతోంది. గ్రేటర్ మున్సిపల్ అధికారుల నుంచి ముందస్తు అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడంతోనే తొలగించినట్లు తెలుస్తోంది. కాగా, సాయుధ పోరాట యోధురాలి విగ్రహాన్ని రహస్యంగా తొలగించడంపై రజక సంఘాల నాయకులు ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో పోలీసులు, అధికారులు కార్యాచరణలోకి దిగారు. నిర్వాహకులతో సోమవారం చర్చలు జరిపి తాత్కాలికంగా రాస్తారోకో కార్యక్రమాలను ఆపించారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య సైతం మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మహాత్మాగాంధీ, శాస్త్రికి నివాళి

స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నగర వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం, దేశానికి వారు చేసిన సేవలను పలువురు కొనియాడారు. - సాక్షి నెట్‌వర్క్



వరంగల్ కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు



డీసీసీ భవన్‌లో గాంధీ, శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు



పీటీసీలో గాంధీ, శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ పూజ, తదితరులు



బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్ సింధూశర్మ, అధికారులు



కేయూలో నివాళులర్పిస్తున్న వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, తదితరులు



హనుమకొండ హౌజింగ్ బోర్డులో జిల్లా సంక్షేమాధికారి మధురిమ, తదితరులు



కాశిబుగ్గలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు



వరంగల్: గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ములుగు రోడ్డులోని ఎల్బీ కళాశాలలో నివాళులర్పిస్తున్న ఎన్సీసీ కేడెట్లు, అధ్యాపకులు



ఏఆర్ఆర్ నగర్ కాలనీలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ కార్యకర్తలు



నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాలలో గాంధీ చిత్రపటం వద్ద బహుమతులతో ఉపాధ్యాయులు



మడికొండ: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# సమస్యలపై జర్నలిస్టుల నిరసన గళం

నయీంనగర్: జర్నలిస్టుల డిమాండ్లను నెరవేర్చాలని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టులు డిమాండ్ చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల నిరసన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఐజేయూ జాతీయ నాయకుడు దాసరి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, పిన్నా శివకుమార్, విష్ణువర్ధన్, జర్నలిస్టులు పాల్గొన్నారు. అనంతరం హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.



నయీంనగర్: నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

**మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలి**

ఎంజీఎం: దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయడంతో పాటు ప్రత్యేకంగా మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని టీయూడబ్ల్యూజే వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంచందర్, మట్టా దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. గాంధీ జయంతి సందర్భంగా ఎంజీఎం జంక్షన్‌లో జర్నలిస్టులు సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంగోజు రవి, మిద్దెల రంగనాథ్, వడిచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పేద క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీట



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: పేద క్రైస్తవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి ఇందిరా కాలనీలోని కల్వరి ప్రార్థన మందిరంలో మండల పాస్టర్ల ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం మండల చైర్మన్ యేసన్న, అధ్యక్షుడు రత్నం, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మార్కెట్ డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మడికొండ: 46, 64వ డివిజన్ల పరిధిలోని మడికొండ, టేకులగూడెంతో పాటు పలుకాలనీల్లో రూ.13.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేపట్టారు.

# ప్రవక్త బోధనలు ప్రపంచానికే ఆదర్శం

ఖిలా వరంగల్: మహ్మద్ ప్రవక్త మానవాళికి అందించిన నీతి సూత్రాలు, దివ్య ఖురాన్‌లోని బోధనలు ప్రపంచానికే ఆదర్శమని చెన్నై మత గురువు మౌలానా డాక్టర్ షహీద్‌షా ముస్తఫా అలీ, ఉర్సు దర్గా పీఠాధిపతి నవీద్ బాబా, బీఆర్ఎస్ నేత సయ్యద్ మసూద్, రాష్ట్ర కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కేర్ టేకర్, ఈద్గా ఖిలా వరంగల్ జానుల్లా షహీద్ దర్గా ప్రతినిధి ఎంఏకే తన్వీర్ అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా వరంగల్ - ఖమ్మం రహదారిపై వరంగల్ ఫోర్ట్ రోడ్డులో గంజ్ షోహద్ రహిమతుల్లా హాలే రౌషన్ షహీద్ మసీదు దర్గాలో దర్గా అధ్యక్షుడు సయ్యద్ షా ఆరీఫొద్దీన్ హుస్సేనీ సాబేరి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వేడుకలు నిర్వహించారు.



ప్రార్థనలు చేస్తున్న నవీద్‌బాబా, ముస్తఫా అలీ

# పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

మామునూరు: కార్యాలయాలు, ఇంటి నివాస ప్రాంతాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పీటీపీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల, కేవీకే పరిసరాల్లో పరిపాలన విభాగం అధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆమె హాజరై స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, భిక్షపతి, ఆర్ఐలు చంద్రశేఖర్, నవీన్, కాశిరాం, సీఎల్ఐలు వడ్డె నరేష్, అశోక్, రాజన్‌బాబు, సత్యనారాయణ, సుధాకర్, గోవర్ధన్, దేవేందర్‌రెడ్డి, సర్వర్, ఆర్ఎస్సైలు దశరథం, సుధాకర్, సీసీ రామాంజనేయ రెడ్డి, వెంకటేశ్వర్లు, పీఆర్ఓ రామచారి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న పూజ, పోలీస్ అధికారులు

**పరిశుభ్రతతోనే ఆరోగ్యం**

హసన్‌పర్తి: పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతోందని కార్పొరేటర్ సునీల్‌కుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 56వ డివిజన్ గోపాలపురంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్స్ సిటిజన్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, సభ్యులు రాజేందర్, సత్యనారాయణ, సాంబయ్య, మలహాల్‌రావు, నరసింహారావు, దామోదర్ పాల్గొన్నారు.

# 'అడ్లూరు'కు మహాగణిత ఉపాధ్యాయ అవార్డు



అవార్డు అందుకుంటున్న నరసింహమూర్తి

హన్మకొండ: గణిత శిరోమణిగా భాసిల్లుతున్న డాక్టర్ అడ్లూరు నరసింహమూర్తి.. మహా గణిత ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గణిత రంగంలో విశేష కృషి చేస్తున్న హనుమకొండ పరిమళకాలనీకి చెందిన నరసింహమూర్తిని అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డు అసోసియేషన్ మహా గణిత ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది. హైదరాబాద్ గోపాల్ కళాభవన్‌లో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అధినేత డాక్టర్ చింతపట్ల వెంకటాచారి, అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డు అసోసియేషన్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గుజ్జారి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నరసింహమూర్తి అవార్డు అందుకున్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి

హన్మకొండ: సమస్యల పరిష్కారం కోసం గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, ఈక్రమంలో ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలని కోరుతూ గాంధీజీ విగ్రహానికి మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం వినతి పత్రం అందజేశారు. జాతిపిత గాంధీ జయంతి సందర్భంగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) కార్యదర్శి ఎస్.రజిత, ఉపాధ్యక్షుడు సారంగపాణి మాట్లాడుతూ గాంధీజీతో పాటు మంత్రి దయాకర్‌రావు, చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్‌కు కూడా వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శాంత, లక్ష్మి, అనసూయ, అనురాధ, సరిత, ఫర్వీన్, సంధ్య, రాజ్యలక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

# జీఓ నంబర్ 142ను రద్దు చేయాలి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తూ..

ఎంజీఎం: వైద్యారోగ్య శాఖలో జీఓ 142ను రద్దు చేయాలని ఆ జీఓ రద్దు కమిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంజీఎంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి సోమవారం వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్ఓ యాకుబ్‌పాషా మాట్లాడుతూ జీఓ 142.. వైద్యారోగ్యశాఖ ఉద్యోగులకు గొడ్డలిపెట్టు లాంటిదని విమర్శించారు. కార్యక్రమంలో నెహ్రూచంద్, యాదానాయక్, మాధవరెడ్డి, ప్రసాద్, పురుషోత్తం, రవీందర్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణార్జునరావు, సోమేశ్వర్, శ్రీనివాస్, కిషన్ నాయక్, దేవ్‌సింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

**గిరిజన వర్సిటీ ఏర్పాటుపై హర్షం**

నయీంనగర్: ములుగు జిల్లాలో సమ్మక్క - సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటు ప్రకటనపై గిరిజనులందరు హర్షం వ్యక్తం చేస్తున్నారని వనవాసీ కల్యాణ పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిట్టిమళ్ల శ్యాంప్రసాద్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన వికాసానికి తమ వంతు తోడ్పాటు అందజేస్తామని అన్నారు. సమ్మయ్య, యాదగిరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**శ్రమదోపిడీకి పాల్పడుతున్న ఎన్పీడీసీఎల్**

హన్మకొండ: అన్‌మ్యాన్డ్ కార్మికుల శ్రమదోపిడీకి టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం పాల్పడుతోందని, ఈక్రమంలో వారు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డిస్కం గౌరవాధ్యక్షుడు జీ.ప్రభాకర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి కాపుల కనపర్తి సబ్‌స్టేషన్ పరిధిలోని లోహిత గ్రామంలో అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ పబ్బోజ్ శ్యామ్ విద్యుత్ ప్రమాదానికి గురి కాగా, వరంగల్‌లోని గార్డియన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు నాయకులతో కలిసి శ్యామ్‌ను ఆస్పత్రిలో ప్రభాకర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు.

**పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

హన్మకొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ సూచించారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం 58వ డివిజన్ సమావేశం సోమవారం జరిగింది. అనంతరం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం 58వ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా మహమ్మద్ ఉమైర్ ఎన్నికయ్యారు. సమావేశంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఖండేరావు నర్సింహరావు, ఇమ్మడి రాజు, గంధ్రకోట రాకేష్ యాదవ్, బైరపాక ప్రశాంత్, బొల్లికొండ వీరేందర్, పరుశరాములు పాల్గొన్నారు.

**సమాజ సేవలో యువత ముందుండాలి**

హసన్‌పర్తి: సమాజ సేవలో యువత ముందుండాలని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య పిలుపునిచ్చారు. రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువేల్పుల క్రాస్‌లోని లార్డ్ వృద్ధాశ్రమంలోని అనాథ వృద్ధులకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అబ్బయ్య మాట్లాడుతూ అనాథ వృద్ధుల సేవ దైవసేవతో సమానం అని అన్నారు. రజక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చీకటి గురురాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు చీకటి శివరాజ్, రవీందర్, కుమారస్వామి, కమలాకర్, సురేష్, రాకేష్, సతీష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**శ్వేతార్కుడికి సంకటహర చతుర్థి పూజలు**

కాజీపేట: సంకటహర చవితిని పురస్కరించుకొని కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారిని విభూది, పసుపుతో సోమవారం హరిద్రోదకాభిషేకం నిర్వహించారు. ఉదయం 7గంటలకు పాలాభిషేకంతో ప్రారంభమైన పూజలు.. రాత్రి 8గంటలకు దుర్వాహోమంతో ముగిశాయి. కార్యక్రమంలో అర్చకులు సాయికృష్ణశర్మ, రాధాకృష్ణశర్మ, టంటం దయాకరశర్మ, హరిస్వామి, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్ పాల్గొన్నారు.

**'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి**

హన్మకొండ అర్బన్: పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, రెండవ పీఆర్సీ వర్తింప చేయాలని, క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య పిలుపునిచ్చారు. నగరంలోని ఎల్‌బీసీ సర్కిల్‌లో పారిశుద్ధ్య కార్మికులతో సోమవారం నిర్వహించిన

**అధికారుల తీరుపై కాలనీవాసుల ఆగ్రహం**

హసన్‌పర్తి: సెల్ టవర్ ఏర్పాటును నిలిపివేయకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని ఒకటవ డివిజన్ నారాయణనగర్ కాలనీలో సెల్‌టవర్ ఏర్పాటును నిలిపివేయాలని వారం రోజుల క్రితం కమిషనర్ రిజ్వాన్ బాషాను కాలనీవాసులు కలిసి ఫిర్యాదు చేశారు. కాలనీకి చెందిన వీ.చంద్రశేఖర్ అనే వ్యక్తి అనుమతి లేకుండానే తన ఇంటి నిర్మాణం చేపడుతూ దానిపైన సెల్ టవర్ ఏర్పాటు కోసం ఒప్పందం కుదుర్చుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా అధికారుల తీరును నిరసిస్తూ దీక్ష చేపట్టాలని కాలనీవాసులు సోమవారం నిర్ణయించారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**

న్యూశాయంపేట: డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు నగర డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ అన్నారు. 36వ డివిజన్‌లో పలు కాలనీల్లో సోమవారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సయ్యద్ మసూద్, యాకయ్య, రమేష్, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

**ట్రిమిస్ కౌన్సిలర్‌కు అభినందన**

న్యూశాయంపేట: కొన్ని సంవత్సరాలుగా తక్కువ వేతనంతో పనిచేస్తూ మైనారిటీల విద్యాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్న ట్రిమిస్ కౌన్సిలర్ సర్వర్ మొహియొద్దీన్ ఘాజీని తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థ డిప్యూటీ సెక్రటరీ, ఉమ్మడి వరంగల్ జిల్లా డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ కృష్ణకుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎల్‌సీ -2 టీ.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ భిక్షపతి, జనగామ ఆర్ట్ టీచర్ గులాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

**ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం**

కాజీపేట: కాజీపేట పట్టణంలో లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 128 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ సుస్మిత పర్యవేక్షణలో వైద్య సిబ్బంది.. కంప్యూటర్ ఆధారంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 13 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయాల్సిన అవసరం ఉందని, డాక్టర్ విశ్వనాథరావు ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**తూర్పుకోటలో ఆటో అడ్డా ప్రారంభం**

ఖిలా వరంగల్: వరంగల్ 37వ డివిజన్ తూర్పుకోట హనుమాన్ జంక్షన్‌లో అంజనిపుత్ర ఆటో యూనియన్ అడ్డాను కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యానికి చేర్చాలని సూచించారు. ఈసంపెల్లి సంజీవ, బాబు, ప్రభాకర్, రాజు, మంద శ్రీధర్‌రెడ్డి, యాకూబ్, శివ, కృష్ణ, రవి పాల్గొన్నారు.

**కేయూలో కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన**

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కుక్టా జేఏసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ లెక్చరర్లు విధులు బహిష్కరించి సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, బాధ్యులు నాగయ్య, అనిల్‌కుమార్, మధుకర్ రావు, శ్రీదేవి, కల్పన, లక్ష్మి, తూర్పాటి వెంకటేష్, సదాశివ్, లక్ష్మారెడ్డి, రాజన్‌బాబు, చీకటి శ్రీనివాస్, విజయకుమార్, గాదె కిషన్ పాల్గొన్నారు.

**ఆర్ట్స్ కళాశాలలో కొనసాగుతున్న దీక్షలు**

అన్ని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కుక్టా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కుక్టా జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు పాల్గొన్నారు.

**సోల్తి కిరణ్ గౌడ్‌కు మద్దతు**

హన్మకొండ: పరకాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్న సోల్తి కిరణ్ గౌడ్‌కు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ గౌడ యువజన సంఘాల నాయకులు తెలిపారు. తెలంగాణ గౌడ యువజన సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండలోని ఏకశిల పార్కులో జనగాని రాజేందర్ గౌడ్ అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది.

# న్యాయం చేయాలని ర్యాలీ

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం 45వ డివిజన్ పరిధిలోని రాంపేట గ్రామంలో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సోమవారం వినూత్న ర్యాలీ చేపట్టారు. వారి కథనం ప్రకారం 2021వ సంవత్సరంలో హత్యకు గురైన రాంపేట గ్రామానికి చెందిన వేల్పుల సమ్మయ్య (అల్లాసేట్) కేసు తుది దశకు వచ్చింది. ఈక్రమంలో సాక్షులను హంతకులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.



ర్యాలీలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు